క్లుప్తంగా

ఆర్ ప్రోగ్రామింగ్‌పై పుస్తకావిష్కరణ

రాజానగరం: ప్రాపబిలిటీ, స్టాటిక్స్ విత్ ఆర్ ప్రోగ్రామింగ్‌పై జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గణపతి స్వామి చింతాడ రచించిన పుస్తకాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు గురువారం ఆవిష్కరించారు. వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ స్వామి బయోస్టాటిస్టిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్‌లో అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకున్న కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, డేటా ఎనాలసిస్, సైబర్ సెక్యూరిటీస్, డేటా సైన్స్‌తో పాటు వైద్యం, ఫార్మా, వ్యవసాయ రంగంలో పలు నూతన పరిశోధనలు చేసే విద్యార్థులకు, అధ్యాపకులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామిని డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశాంత్ కుమార్ మిశ్రా అభినందించారు.

11 నుంచి క్రీడా పోటీలు

అనపర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 మండల స్థాయి బాల, బాలికల క్రీడా పోటీలు ఈనెల 11, 12 తేదీల్లో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు, క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తామన్నారు.

జీ 20 సదస్సుపై అవగాహన



వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

బిక్కవోలు: ఢిల్లీలో శుక్రవారం నుంచి పదో తేదీ వరకూ జరిగే జీ 20 సదస్సుపై ఊలపల్లి గ్రామంలోని ముల్లంగి బుల్లివీరన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గొలుగూరి వెంకటరామారెడ్డి, సీహెచ్ వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరించారు. హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు విజయ, గీత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెదపూడి: కరకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, కొత్తగా ఏర్పాటు చేసే 33/కేవీ పనుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని కాకినాడ విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. కరకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని కరకుదురు ఏపీత్రయం, రామేశ్వరం, దోమాడ, పెదపూడి గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కట్నం వేధింపులపై కేసు

రంగంపేట: కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీరామకృష్ణ గురువారం తెలిపారు. బాలవరానికి చెందిన మందనక్క సూర్యారావు కుమార్తె అనితకు 2020లో బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన కామరపు నవరత్నతో వివాహమైంది. అయితే కొంత కాలంగా అనితను భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. గ్రామ పెద్దల సాయంతో ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అనిత పోలీసులను ఆశ్రయించింది.

సారా విక్రేత అరెస్టు



నిందితుడితో ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి

రంగంపేట: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సిఐ వెంకటలక్ష్మి గురువారం తెలిపారు. ఈలకోలను దబ్బగొయ్యి వద్ద దాడులు నిర్వహించగా, ఈలకొలను గ్రామానికి చెందిన ఏ.చిన్నారాజు 10 లీటర్ల సారాతో పట్టుబడ్డాడన్నారు. అలాగే 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, రెండు అల్యూమినియం పాత్రలను సీజ్ చేసినట్లు తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని 3వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బళ్ల సత్యవతి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ నరసమ్మ ఆధ్వర్యంలో నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్లో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోష్టికాహార మాసోత్సవం (పోషకాహారలోపం లేని, నిరక్షరాస్యత లేని స్వయంశక్తి గల ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన పోషకాహార వంటకాలను అందజేశారు.

ఈక్రాప్ నమోదు.. లాభాలు బోలెడు

- పంటల నమోదుతో అన్నదాతకు భరోసా
- పదో తేదీకి పూర్తి చేసేలా వ్యవసాయ సిబ్బంది ప్రణాళిక



ఈక్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సురేష్ కుమార్

అనపర్తి: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతులకు అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా సొంత గ్రామాల్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందేలా చర్యలు తీసుకుంది. రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఈ క్రాప్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి అన్నదాతలకు భరోసాగా నిలుస్తోంది. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు రైతులందరూ తమ పంట సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. పంట నమోదులో మరింత పారదర్శకంగా నిర్వహించేందుకుగాను ప్రభుత్వం గతంలో ఉన్న విధానంలో మార్పులు చేస్తూ నూతనంగా జియోఫెన్సింగ్ పద్ధతిని తీసుకువచ్చింది.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

అర్హులైన అన్నదాతలందరికీ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ఈ క్రాప్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులు ఏ రకమైన పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు అనే వివరాలను ఇందులో నమోదు చేస్తారు. పంట నమోదు విషయంలో గత ఏడాది అక్కడక్కడా పొరపాట్లు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు నేపథ్యంలో కొత్తగా తీసుకువచ్చిన జియోఫెన్సింగ్ విధానంలో ఎంపిక చేసిన సర్వే నంబర్లలో సాగు చేసిన పొలంలోనే సంబంధిత రైతును ఉంచి ఫొటో తీసి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వీఏఏ, వీహెచ్ఏల ద్వారా ఈ క్రాప్ నమోదు నిర్వహిస్తున్నారు. వివరాలు నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ సంబంధించిన మొబైల్ నంబర్‌కు మెసేజ్ రూపంలో డిజిటల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ వెళుతుంది. ఈ క్రాప్ నమోదుతో పాటు ఈ కేవైసీ చేయించుకున్న అనంతరం సంబంధిత రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా ఫిజికల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ కూడా అందుతుంది. ఈ విధానంతో కచ్చితమైన సమాచారం అందడంతో రైతులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతాయి. ఈ క్రాప్ నమోదును ఈనెల 10వ తేదీ నాటికి పూర్తి చేసేలా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఈక్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతూ విధిగా ఈ కేవైసీ చేయించుకోవాలి. తద్వారా ప్రభుత్వం అందించే ప్రతి పథకం దళారుల ప్రమేయం లేకుండా రైతులకు నేరుగా అందుతుంది.



ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రైతులకు అందే ప్రయోజనాలివే..

ఈ క్రాప్ నమోదుతో అన్నదాతలకు అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు నష్టపోయిన పంటకు బీమా, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ రాయితీ తదితర ప్రయోజనాలు వర్తిస్తాయి. అలాగే పురుగు మందులు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు, పెట్టుబడి సాయం మంజూరు వంటి లాభం పొందవచ్చు.

నియోజకవర్గ పరిధిలో....

అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి, రంగంపేట, బిక్కవోలు, రంగంపేట మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 48,360 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 22, 917 ఎకరాలు మాత్రమే ఈ క్రాప్‌లో నమోదైనట్లు అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి



ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ఈ క్రాప్ నమోదుపై అన్నదాతలు అవగాహన పెంపొందించుకుని పంట వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం ప్రతి రైతూ విధిగా ఈ కేవైసీ చేయించుకోవాలి. అప్పుడే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, ప్రయోజనాలను పొందగలరు. నమోదు ప్రక్రియను ఈనెల 10వ తేదీలోగా పూర్తిచేసేలా ప్రణాళికలను సిద్ధం చేశాం.

– బి.సురేష్ కుమార్, మండల వ్యవసాయాధికారి, అనపర్తి

నేడు గాదరాడలో డ్వాక్రా గ్రీవెన్స్

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలో శుక్రవారం డ్వాక్రా గ్రూపులకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్వయం సహాయక సంఘాల ఏపీఎం జయంతి రాజ్ తెలిపారు. స్థానిక సచివాలయంలో మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలకు నవరత్నాలు, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత పథకాలు అందుతున్నదీ, లేనిదీ గుర్తించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పదో వారానికి చేరుకున్న గురుచరిత్ర పారాయణ

రాజానగరం: లోక కల్యాణం, ప్రజా సంక్షేమాన్ని కోరుతూ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో 11 గురువారాలు నిర్వహించాలనే సంకల్పంతో ప్రారంభించిన గురు చరిత్ర పారాయణ పదోవారానికి చేరుకుంది. స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న పారాయణ కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొంటున్నారు. వేకువజామున కాకడ హారతి అనంతరం ప్రారంభమై మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతోంది. 11 గురువారాలు గురు చరిత్రను పారాయణ చేసి, 12వ వారం (సెప్టెంబర్ 21) సాయి సచ్చరిత్రను పారాయణ చేస్తారు. ఈ విధంగా 12 వారాలు పారాయణలో పాల్గొన్న భక్తులకు ఆఖరి రోజున సాయి సచ్చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన జరిగింది.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



కోటికేశవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- నవరత్న పథకాలతో అందరి అభ్యున్నతి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం నవరత్నాలను అమలు జరుపుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో మహాత్మాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. స్థానిక శివాలయంలో పూజలు చేశారు. అనంతరం ఎస్సీపేటలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కోటికేశవరం గ్రామాభివృద్ధికి రూ.6.35 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.39 లక్షలు మాత్రమే కేటాయించిందన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే జగనన్నకు మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ముడే సింధూదివ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, పార్టీ సీనియర్ నాయకులు ములగాడ ఫణికుమార్, ఎంపీటీసీ సభ్యులు నేతల బుజ్జి, యువజన విభాగం మండల కన్వీనర్ ఉల్లి గణ, కోటి కేశవరం మాజీ సర్పంచ్ ముండ్రు శ్రీరామ్మూర్తి, ముడే కామేష్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం

కడియం: కడియపుసావరంలో అగ్ని ప్రమాదానికి గురై నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు, వర్షాల వలన ఇంటికప్పు కోల్పోయిన కుటుంబానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి ఆర్థిక సాయం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, ఎంపీటీసీ సాపిరెడ్డి దుర్గా కామేష్ తదితరులు అగ్ని ప్రమాద బాధితుల ఇబ్బందులను చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చక్రవర్తి బాధితులు బొబ్బనపల్లి మరియమ్మ, ముత్యాత్తుల సూర్యనారాయణ, కొల్నాటి సత్తెమ్మ, కె.బుజ్జమ్మ తదితరులకు ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందించారు. అలానే జ్యోతుల అర్జున్, సాపిరెడ్డి రాజు, సాపిరెడ్డి కామేశ్వర్ ఫ్రెండ్ సర్కిల్ ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణు, జ్యోతుల సుధీర్, వరగోగుల ధర్మయ్య, సాపిరెడ్డి బాబీ, సేలం నరసింహ , పల్నాటి అబ్బులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై ప్రజల హర్షం

- ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో అభివృద్ధి పనుల ప్రారంభం

పెదపూడి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్నివర్గాల ప్రజల ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రతి కుటుంబం కోరుకుంటోందన్నారు. పెదపూడి గ్రామంలో రూ.62 లక్షలతో నిర్మించిన సచివాలయం, పీఏసీఎస్ గోడౌన్, డ్రైనేజీ, ఆలయ ప్రహరీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ఇంటివద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. పేదరికమే ప్రామాణికంగా తీసుకునే పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ బ్యాంక్ సీఈఓ ఆర్వీ నరసింహరాజు, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచి కలవల కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, సొసైటీ ప్రతినిధులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పెదపూడిలో సొసైటీ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ఇంకుడుగుంతల పరిశీలన



రఘుదేవపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాస్

సీతానగరం: కాటవరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరిగిన ప్రాంతాల్లో ఇంకుడు గుంటల ఏర్పాటును ఎంపీడీవో కె.రమేష్‌తో కలిసి ఏపీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. అలాగే రఘుదేవపురం నుంచి కూనవరం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటిన విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఉపాధిహామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ దినసరి వేతనం రూ.272 వచ్చేలా పనులు చేయాలని కూలీలకు వివరించారు. ఒక్కరూ బ్యాంకుఖాతాలకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏవో కె.నాగ శేషవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సత్య పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి జగన్ కృషి



కలవచర్లలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలలో మహిళలకే అగ్రాసనం వేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని సీతారామపురం, కలవచర్లలో స్వయం సహాయక సంఘాల మహిళలతో గురువారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా నిలదొక్కుకునేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గతంలో డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. అదే 2019 ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అప్పటి వరకూ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులలో ఉన్న రుణాలను నాలుగు విడతలుగా మీ ఖాతాలలోకి జమ చేసిన విషయాన్ని మరచిపోవద్దన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసేలా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



వీర్రాఘవరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కర్రి వీర్రాఘవరెడ్డిని గురువారం పందలపాక మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం అప్పారెడ్డి, ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయనను కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అభినందించారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



బాలకృష్ణుడితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



జి.మామిడాడ సూర్యదేవాలయం వద్ద వేడుకలు



పాలమూరులో ఉట్టి ఉత్సవం

రాజానగరం: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దివాన్‌చెరువులోని శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నేటి తరం విద్యార్థులకు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండగల గురించి తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం శ్రీకృష్ణుని వేషధారణతో ఉన్న చిన్నారులతో సరదాగా గడిపారు.

పెదపూడి: జి.మామిడాడలోని సూర్యనారాయణ మూర్తి స్వామి ఆలయం, బోడావారి వీధి, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం వైభవంగా జరిపారు. ఏపీత్రయం, పెదపూడి, సంపర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ, సూర్యదేవాలయం ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కె.శ్రీనివాసురెడ్డి, పప్పు చిన్నారెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి, నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెలంపేటలో యాదవుల సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. పందలపాకలోని వెలంపేట కట్టమ్మ గుడి వద్ద యూత్ కొల్లి రాము ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

అనపర్తి: పాలమూరులోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉట్టి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు అంగర వంశీకృష్ణ ఆధ్వర్యంలో వైఖానస ఆగమ విధానంలో రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి వార్లను వివిధ పుష్పాలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే ఉత్సవంలో గొల్ల వంశీకులు పాల్గొన్నారు. రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి నిత్యమాస కల్యాణం గురువారం వేడుకగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మ వాడపల్లి వేణుగోపాలాచార్యులు గ్రామానికి చెందిన తాడి ఆదిత్యరెడ్డి, సత్య సుస్మిత దంపతులతో జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

గోకవరం: మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోకవరం వెలమపేటలోని గీతా మందిరంలో సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే ఉత్సవం, చిన్నారులకు వేషధారణల పోటీలు నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. అలాగే పెంటపల్లి, కామరాజుపేట, తంటికొండ, మల్లవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



గోకవరంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరిస్తున్న చిన్నారులు

నేడు అవార్డు గ్రహీతలకు సన్మానం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్లో శుక్రవారం పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరవుతారు. రాష్ట్రస్థాయిలో గాడాల హైస్కూల్ టీచర్ పిట్టా శిరీష కుమారి, జిల్లాస్థాయిలో కాపవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దాకే విజయ మణి, నర్సాపురం హైస్కూల్ ఉపాధ్యాయుడు అయినాల అర్జునరావు ఉత్తమ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. మండల స్థాయిలో ఎంపికైన వీకే సుధాకర్ (కణుపూరు ప్రాథమిక పాఠశాల), సీహెచ్ శ్రీనివాసరావు (శ్రీరంగపట్నం), కె.నాగేశ్వరరావు (పశ్చిమగానుగూడెం), సీహెచ్ సరళ కుమారి (కోరుకొండ), కె.లక్ష్మణ రేఖ (సీఆర్‌పీ), డ్రాయింగ్ టీచర్ కేసీహెచ్ జాకబ్‌రాజు (గుమ్ములూరు హైస్కూల్), జి.రామారావు (కోరుకొండ సిద్ధార్థ)కు అవార్డులు అందజేసి, సత్కరిస్తారు. కాగా.. ఉత్తమ ఉపాధ్యాయులందరికీ ఎంఈఓలు టి.కుశలవదొర, ఎం.సుజాత, యూటీఎఫ్ కోరుకొండ మండలాధ్యక్షుడు గింజాల శివబాబు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మింగి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

పేపర్ మిల్లును తరలించండి

ప్రకాశం నగర్: ప్రజలు లేని ప్రదేశానికి పేపర్ మిల్లును తరలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఈ మెయిల్ ద్వారా కోరినట్లు జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు గురువారం ప్రకటనలో తెలిపారు. పేపర్ మిల్లు కాలుష్యం కారణంగా లూథరన్ గిరి, ఆనంద్ నగర్, కోటిలింగాలపేట, మల్లయ్యపేట, కాతేరు ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిల్లు నుంచి కలుషిత నీరు నేరుగా గోదావరిలోకి వెళ్లడం వలన తాగునీరు కలుషితమవుతోందన్నారు. కాలుష్య నివారణకు మిల్లు యాజమాన్యం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శించారు.

నేడు రంగాపురంలో గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ గండికోట వీరభద్రరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల తరలిరావాలని కోరారు.

నేడు మహా కుంభాభిషేకం

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ జామి విశ్వేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఏటా శ్రావణ మాసం నాలుగు శుక్రవారం ఈ కుంభాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 15 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని, వారందరికీ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.